క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు రూ.26 వేలు జీతం ఇవ్వాలి

సీఐటీయూ ప్రధాన కార్యదర్శి బుద్ధ రాజా

వించిపేట(విజయవాడపశ్చిమ): నగరంలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు రూ.26 వేలకు తగ్గకుండా జీతాలు ఇవ్వాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్ధ రాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం 55వ డివిజన్ శానిటరీ కార్యాలయం వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు, నిత్యవసరాలను చెల్లించుకోవాలంటే జీతాల మీద ఆధారపడి జీవించే పారిశుద్ధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీస వేతనం అమలు చేయకుండా అరకొర జీతాలతో పనిచేస్తున్న వీరికి మరోపక్క పనిభారం కూడా పెరిగిపోయి అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ కనీస వేతనం అమలు చేయకపోడం దుర్మార్గమని, తక్షణమే వారికి జీతాలు పెంచి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆర్థిక సాయం అందజేత



పటమట(విజయవాడతూర్పు): తోటివారు ఆపదలో ఉంటే అందరూ సహకరించి వారికి భరోసాను కల్పించాలని పటమట సీఐ వి. పవన్ కిషోర్ అన్నారు. పటమట పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ బాజీబాబు కుమారుడు అనారోగ్యానికి గురవ్వటంతో చికిత్స నిమిత్తం స్టేషన్ సిబ్బంది సేకరించిన నగదును శుక్రవారం సీఐ పవన్‌కిషోర్ ఆధ్వర్యంలో బాజీబాబుకు అందించారు. ఈ కార్యక్రమంలో పటమట ఎస్ఐలు హరికృష్ణ, కృష్ణవర్మ, రైటర్ సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వేధింపులకు గురి చేస్తున్న భర్తపై భార్య ఫిర్యాదు చేయగా కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. టేనర్‌పేట కొండ ప్రాంతంలో షేక్ హేమలత, చాన్‌బాషా కుటుంబం నివాసం ఉంటుంది. వీరిద్దరిది ప్రేమ వివాహం కాగా, ఒక బాబు సంతానం. ఆటో నడుపుకుని జీవనం సాగించే చాన్‌బాషా కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. తరుచూ భార్యను వేధింపులకు గురి చేయడమే కాకుండా పుట్టింటికి వెళ్లి కట్నం తీసుకురావాలని ఒత్తిడి చేసేవాడు. దీంతో బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

బైక్ ఢీ కొని వ్యక్తికి గాయాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రోడ్డు వెంట నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని అతివేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టిన ఘటనలో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు... భవానీపురం హెచ్‌బీ కాలనీ ఎంఐజీకి చెందిన సింగంపల్లి రవికుమార్ ఇంటి నుంచి బయలు దేరి క్రాంబే రోడ్డులోని మెడికల్ షాపు వద్దకు నడుచుకుంటూ వెళుతున్నాడు. రైతు బజార్ సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రవికుమార్ ఎడమ మోకాలు, తల వెనుక భాగంలో దెబ్బలు తగిలాయి. రవికుమార్ సోదరి లత వచ్చి ఆటోలో ఆసుపత్రికి తరలించింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవికుమార్ ఘటనపై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మతిస్థిమితం లేని వ్యక్తి ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన ఘటన విద్యాధరపురం సితారా సెంటర్‌లో చోటుచేసుకుంది. ఏనుగతల నరసింహారావు లారీ క్లీనర్‌గా పనిచేసేవాడు. గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. మతి స్థిమితం లేదు. ప్రతి రోజు ఇంటి వద్ద నుంచి సితారా సెంటర్ వరకు వెళ్లి వస్తుంటాడు. గత నెల 29న ఇంటి నుంచి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు అతని ఆచూకీ కోసం వెతికినా కనిపించలేదు. దీంతో ఆయన భార్య పద్మావతి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సాగర్ జలాలతో చెరువులు నింపాలి

మైలవరం: సాగర్ జలాలతో చెరువులు నింపాలని రైతుసంఘం మైలవరం మండల అధ్యక్షుడు రావుల సుబ్బారావు, కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. మైలవరంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సాగర్ జలాలను విడుదల చేస్తే నియోజకవర్గంలోని పలు చెరువులను నీటితో నింపవచ్చని, తద్వారా రైతులు వేసిన పంటలకు నీటి ఎద్దడి ఉండదన్నారు. సరైన వర్షాలు కురవకపోవడంతో చెరువులు నిండక రైతులు వేసిన పంటలు ప్రారంభంలోనే ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. సాగర్ జలాలు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని, వృధాగా పోతున్న సాగర్ జలాల విషయంలో స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ దృష్టి సారించి చెరువులు నింపి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు వజ్రాల ధనలక్ష్మి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రత పూజలు

కిటకిటలాడిన ఆలయాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని మహిళలు అత్యంత వైభవంగా తమ గృహాల్లో వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించుకున్నారు. పవిత్ర శ్రావణ శుక్రవారం అందులోనూ వరలక్ష్మీ వ్రతం కావడంతో ఆయాలన్ని కిటకిటలాడాయి. వన్‌టౌన్‌లోని వైష్ణవ, శైవ, శక్తి ఆలయాలన్ని భక్తులతో కిటకిటలాయి.

వెంకన్న సన్నిధిలో..

వన్‌టౌన్‌లో వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పద్మావతి దేవి అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేశారు. శుక్రవారం పలు కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి మాట్లాడారు. సహస్రనామాలతో అర్చన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించారు.

పాతశివాలయంలో....

శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో భ్రమరాంబ అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులుకు దర్శనమిచ్చారు. భక్తులతో అమ్మవారి సన్నిధిలో వ్రతాలను ఆచరింపజేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయంలో ఇతర ఉపాలయాల్లోనూ ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా దీపోత్సవం

శ్రీ కన్యకాపరమేశ్వరి కోదండరామ దేవస్థానం (కొత్తగుళ్లు) ఆవరణలో శ్రీ ఆండాళ్ అమ్మవారికి ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకొని ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం వివిధ



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

అమ్మవార్ల ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో సహస్రదీపాలంకరణ సేవను నిర్వహించారు. వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకస్వాములు పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు పర్యవేక్షించారు.

చదును మహాలక్ష్మీ దేవస్థానంలో ..

కొత్తపేట బ్రాహ్మణవీధిలో వేంచేసి ఉన్న శ్రీ చదును మహాలక్ష్మమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న అష్టలక్ష్మిలు అమ్మవార్లకు కూడా ప్రత్యేక పూజలు చేశారు. భారీగా భక్తులు తరలివచ్చారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రత పూజలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసిన శ్రీనగరాల మహాలక్ష్మీ అమ్మవారు వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు అమ్మవారికి విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతాలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని విశేషంగా అలంకరించారు. భక్తులు తమ ఇళ్లలో వరలక్ష్మీ



వరలక్ష్మీదేవిగా మహాలక్ష్మీ అమ్మవారు

వ్రతాలను ఆచరించిన అనంతరం ఆలయానికి విచ్చేసిన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నట్లు ఆలయ అర్చకులు పేర్కొన్నారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ నిర్వహించగా, పెద్ద ఎత్తున ఉభయ దాతలు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీకి చెందిన మరుపిళ్ల హనుమంతరావు, పిళ్లా శ్రీనివాస రావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాలప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలోని శ్రీలలితాంబికా పీఠంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పీఠాధిపతి శ్రీ శివలీల మాతాశ్రీ అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించగా, పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. పీఠం కన్వీనర్ రాంపిళ్ల చైతన్య ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. భీమన వారిపేటలోని శ్రీ విజయ దుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు, అర్చనలు నిర్వహించారు. ఆలయఅర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు.

కొనసాగుతున్న పవిత్రోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలో వేంచేసి ఉన్న శ్రీభూ సమేత వేంకటేశ్వర స్వామి సన్నిధిలో పలు ప్రత్యేక హోమాలు శుక్రవారం నిర్వహించారు. వన్‌టౌన్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం విష్వక్సేన పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆగమ పండితులు ఆధ్వర్యంలో హోమాలను నిర్వహించారు. పుణ్యాహవాచనం, పవిత్రశయాధివాసం, సుత్రాభిమర్శన, అగ్నిప్రతిష్ఠాపన, ఆకల్మష హోమాదులు, సర్వదైవత్యహోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తులను యాగశాలకు మంగళవాయిద్యాలతో మంత్రోచ్చరణలతో పండితులు తీసుకొచ్చారు. అనంతరం సంకీర్తనాగానాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో



హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, ఉభయదాతలు

సన్యాసిరావు మాట్లాడుతూ 9న స్వామి వారికి విశేష కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. విష్ణు సహస్ర నామపారాయణం కార్యక్రమం జరుగుతుందని, ఉదయం స్వామి వారికి స్నపనాభిషేకాన్ని నిర్వహిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అర్చకస్వాములు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి కార్యక్రమాలను నిర్వహించారు.

వైభవంగా సౌభాగ్యలక్ష్మి పూజలు

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రావణమాసం వరలక్ష్మీవత్రం సందర్భంగా పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం వైభవంగా వరలక్ష్మీ పూజ నిర్వహించారు. టీటీడీ దేవాలయ అర్చక స్వాములు పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్త్రీలకు సౌభాగ్యాన్ని అందించే పసుపు, కుంకుమ, గాజులు, వరలక్ష్మీ కంకణాలను స్వామివారికి సమర్పించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి మాట్లాడుతూ శ్రావణమాసాన్ని మహిళలు పవిత్రమైన మాసంగా భావిస్తారన్నారు. ఆగమ శాస్త్ర ప్రకారం పూజాదికాలు నిర్వహించి



మహిళలకు కంకణాలు, పూజా సామగ్రిని అందజేస్తున్న శ్రీవారి సేవకులు

నట్లు పేర్కొన్నారు. సూపరింటెండెట్ ఆర్. మల్లికార్జునరావు మాట్లాడుతూ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలలో టీటీడీ అనుబంధ 60 దేవాలయాల్లో కంకణాలు సౌభాగ్య కిట్‌ను అందజేసినట్లు తెలిపారు.

వరలక్ష్మీదేవి అలంకారంలో కాళీమాత



సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న మహిళలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): శ్రావణమాసం పురస్కరించుకుని బస్టాండ్ సమీపంలోని కాళీమాత అమ్మవారి దేవస్థానం (త్రిశక్తి పీఠం)లో కాళీమాత అమ్మవారు శుక్రవారం వరలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వరలక్ష్మీ పూజ, బంగారు పుష్పాలతో పుష్పార్చన నిర్వహించి సువాసినులచే సామూహిక వరలక్ష్మీ వ్రతం జరిపించారు. సాయంత్రం మహాలక్ష్మీ అమ్మవారికి భక్తులచే సామూహిక కుంకుమార్చన చేశారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు బి.హెచ్.విజయకిరణ్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



వరలక్ష్మీ దేవి అలంకారంలో కాళీమాత అమ్మవారు

మహనీయుల త్యాగాలు సదా స్మరణీయం

విజయవాడ కల్చరల్: మహనీయుల త్యాగాలు సదా స్మరణీయని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. ఆలిండియా ఘంటసాల చైతన్యవేదిక, శ్రీ కళాభారతి, తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా భారత దేశం–నాడు– నేడు అంశంగా సదస్సు, దేశ భక్తి గీతాల కార్యక్రమాన్ని గాంధీనగర్‌లోని కొతా పూర్ణానందం కళావేదికమీద శుక్రవారం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ నేటి భారత దేశం అగ్రదేశాలను సహితం శాసించే స్థితికి చేరుకుందని తెలిపారు. మహనీయుల త్యాగాలతో వచ్చిన స్వాతంత్ర్య లక్ష్యాలను కాపాడుకోవాలన్నారు. ఘంటసాల చైతన్యవేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వరెడ్డి మాట్లాడుతూ నాటి సినిమాల్లో



సదస్సులో పాల్గొన్న, ప్రతినిధులు, గాయనీ గాయకులు

పాటలు యువతను చైతన్య పరిచాయన్నారు. గాయనీ గాయకులు మల్లాది స్వాతి, టి. శ్రీనివాస రెడ్డి, దుర్గానాగమణి, పరమేశ్వరి, కె.డేవిడ్‌రాజు తదితరులు దేశ భక్తి గీతాలను ఆలపించారు.

పరిసరాల శుభ్రతను పాటించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని



పాయకాపురం(విజయవాడరూరల్): పరిసరాల శుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని తెలిపారు. 64వ డివిజన్ ఎస్ఎస్‌సీ బోస్‌నగర్లో శుక్రవారం నిర్వహించిన డ్రై డే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పరిసర ప్రాంతాలను వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహసిని మాట్లాడుతూ వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. కూలర్లు, ఫ్రిజ్‌లలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని తెలిపారు. అలాంటి చోట్ల దోమలు గుడ్లు పెట్టే అవకాశముంటుందని పేర్కొన్నారు. దీని వల్ల డెంగీ, మలేరియా లాంటి ప్రమాదకర జ్వరాలు వచ్చే వీలుంటుందని చెప్పారు. ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం స్థానికులతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తామని, దోమల పెరుగుదల నిర్మూలనకు కృషి చేస్తామని, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి డాక్టర్ నిహారిక, ఏఎన్ఎమ్‌లు, ఆశావర్కర్లు, మలేరియా సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

కట్టెలేరుకు వరద ఉధృతి

నిలిచిన రాకపోకలు



తిరువూరు: గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టెలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో శుక్రవారం వాహనాల రాకపోకలను నిలిపివేశారు. గంపలగూడెం-విజయవాడ మార్గంలో వినగడప వద్ద కట్టెలేరుపై గతంలో వరదలకు కొట్టుకుపోయిన వంతెన స్థానంలో కొత్తది నిర్మించకపోవడంతో తాత్కాలిక రహదారిపైనే వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వరదలకు ఈ తాత్కాలిక రహదారిపై సైతం రాకపోకలకు వీలులేకపోవడంతో పోలీసులు వంతెన వద్ద పహారా కాస్తున్నారు. గత రెండు రోజులుగా ఎగువన ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండటంతో కట్టెలేరుకు వరద నీరు చేరుతోంది.

మంచినీటి కొరత లేకుండా చూడాలి

కార్పొరేటర్ సత్యబాబు

వించిపేట(విజయవాడపశ్చిమ): స్థానిక 49, 50 డివిజన్‌లలో మంచినీటి కొరత లేకుండా చూడాలని సీపీఎం 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు నగరపాలకసంస్థ అధికారులను డిమాండ్ చేశారు. ఆయా డివిజన్‌లలో శుక్రవారం ఆయన పర్యటించగా, స్థానిక మహిళలు మంచినీటి సమస్యను ఆయన దృష్టికి తెచ్చారు. ఈసందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ 11 ఎంజిడి వాటర్ ప్లాంట్ నుంచి మంచినీటి సరఫరా తగినంత లేకపోవడంతో పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో ప్రజలు ఇబ్బందిపడుతుండటంతో ఈ విషయంపై ఇప్పటికే నగరపాలకసంస్థ సర్కిల్–1 ఈఈకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వారంరోజులుగా ఆయా ప్రాంతాలలో ప్రజలకు తాగునీరు సక్రమంగా రాకపోవడం, మరో పక్క వేసవిని తలపించేలా ఎండల కారణంగా మంచినీటి కోసం



కార్పొరేటర్ సత్యబాబుకు మంచినీటి సమస్యను వివరిస్తున్న మహిళలు

ప్రజలు అవస్థలుపడుతున్నారన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి ఈ రెండు డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి ఇబ్బందులను గుర్తించి, వారికి పూర్తిస్థాయిలో మంచి నీటిని సరఫరా చేయాలని కోరారు. ఆయన వెంట సీపీఎం నాయకులు ఎస్‌కే సలీం గురవప్ప తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ హైవే ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పీ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు వెంకటేశ్వర ఫౌండ్రీ రోడ్, హైవే రోడ్ (65వ నంబర్ జాతీయ రహదారి)లో వెంకటేశ్వర ఫౌండ్రీ నుంచి స్వాతి థియేటర్ వరకు, ఆశ్రమం రోడ్, బేతపూడి అరుణ కుమారి వీధి, బాజీ బాబా మందిరం రోడ్, బోట్ ఏజెన్సీ, మీరా సాహెబ్ వీధి ప్రాంతాల్లో కరెంట్ నిలిపి వేయనున్నట్లు ఆయన వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖతో సహకరించాలని కోరారు.

చిట్టినగర్ సెక్షన్ పరిధిలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సెక్షన్ 33/11 కేవీ మిల్క్ ప్రాజెక్ట్ సబ్ స్టేషన్ పరిధిలోగల 11 కేవీ ఐఎంపీ ఫీడర్, 11 కేవీ టైలర్ పేట ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులతోపాటు మెయింటెనెన్స్ నిమిత్తం కొన్ని ప్రాంతాల్లో మూడు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పీ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు పాల ఫ్యాక్టరీ ఏరియా, సయ్యద్ అప్పల స్వామి కాలేజి వెనుక, ప్రియదర్శిని కాన్వెంట్ ఏరియా, కర్మెల్ రచ్చి రోడ్, ఎమ్ఆర్ఎఫ్ టైర్స్ ఎదురుగా ఏనుగుల అంజయ్య వీధి, సాధు హోటల్ వెనుక, వైశ్య కాలనీ, మోతీ మసీదు, పెట్రోల్ బంక్ ఎదురుగా, జోడు బొమ్మల సెంటర్ తదితర ప్రాంతాల్లో కరెంట్ నిలిపి వేయనున్నట్లు వివరించారు.

రామరాజ్యనగర్ సెక్షన్ పరిధిలో..

ఆర్ఆర్ నగర్ సెక్షన్ 33/11 కేవీ పున్నమి సబ్ స్టేషన్ లోగల 11 కేవీ నేతాజీ ఫీడర్ పరిధిలోగల విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం కొన్ని ప్రాంతాల్లో రెండున్నర గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పీ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యాధరపురంలోని టంటంవారి వీధి, అండిమాని బ్రహ్మయ్య వీధి, గురుకృప రోడ్, సిమెంట్ రోడ్, లొల్లావారి వీధి, టీవీ కృష్ణారావు వీధి, అరవింద వీధి, కేసీ పబ్లిక్ స్కూల్ రోడ్, మువ్వలవారి వీధి, గంజి యలమందయ్య వీధి, వెంకటేశ్వర స్వామి టెంపుల్ రోడ్, భారత్ గ్యాస్ గోడౌన్ ఏరియా తదితర ప్రాంతాల్లో కరెంట్ నిలిపి వేయనున్నట్లు వివరించారు.

తల్లిపాల విశిష్టతను అందరూ తెలుసుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తల్లిపాల విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కోలా విజయశేఖర్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడికా, పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ముగింపును పురస్కరించుకొని శుక్రవారం సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోలా విజయశేఖర్ మాట్లాడుతూ పసిబిడ్డలకు సృష్టిలో తల్లిపాల కన్నా అమృతం మరొకటి లేదన్నారు. తల్లిపాల గురించి ప్రచారం చేయాల్సి రావటం బాధాకరమన్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని, తమ చుట్టూ ఉన్న సమాజాన్ని జాగృతం చేయాలన్నారు. మహిళలు దీనిపై అపోహలు వీడాలన్నారు. తల్లి



మాట్లాడుతున్న డాక్టర్ కోలా విజయశేఖర్

పాలు బిడ్డలకు ఇవ్వటం వలన వారికి సైతం మేలు జరుగుతుందని వివరించారు. లయన్స్ ప్రముఖులు దామర్ల శ్రీశాంతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పీ హరిప్రసాద్, కార్యదర్శి పీ లక్ష్మీశ్రీనివాస్, కోశాధికారి గుర్రం లక్ష్మీనారాయణ లయన్స్ ప్రముఖులు దేవతి నాగేశ్వరరావు తదితరులు నిర్వహించారు.

బీజేపీ చేతిలో కీలు బొమ్మగా ఎన్నికల కమిషన్



ఎస్ఐఆర్ కు వ్యతిరేకంగా ధర్నా చౌక్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రధాని మోడీకీ తొత్తుగా మారిందని, కీలుబొమ్మగా మారి బీజేపీ ఏం చెబితే అదే చేసే విధంగా తయారైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ నందు ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఇది రాజ్యాంగానికే ప్రమాదమని హెచ్చరించారు. దేశ ప్రజల ఓటు హక్కును కాలరాసేందుకే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్–సర్)ను తీసుకొస్తుందన్నారు. బీహార్ రాష్ట్రంలో 15 లక్షల ఓట్లు తొలగించారని, మరో 45 లక్షల ఓట్లు త్రిశంకు స్వర్గంలో ఉన్నాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో మొట్టమొదటిసారిగా ఓటరు తనకు తానే ఓటర్‌ను అని నిరూపించుకునే బాధ్యతను ఓటర్లపైనే పెట్టారని, ఇది అప్రజాస్వామికం, నిరంకుశమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని ప్రజలకు ఓటు హక్కును నిరాకరించడమే ఎస్ఐఆర్ లక్ష్యమని, దీనిని పూర్తిగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్ల అక్రమ తొలగింపు ఆపాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, దొడ్డిదారిన ఎన్ఆర్‌సి అమలు ఆపాలని కోరుతూ నినాదాలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ టీడీపీ ఎంపీలు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఢిల్లీలో లేఖ ఇవ్వడం జరిగిందని, అంతటితో ఆగకుండా ప్రతిపక్షాలు జరిపే పోరాటంలో కలిసి రావాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేస్తోందన్నారు. సర్‌కు వ్యతిరేకంగా ప్రజాస్వామిక వాదులు, వామపక్ష వాదులు ఆందోళన చేస్తున్నారన్నారు. ప్రతిపక్షాల ఆందోళనలకు తలొగ్గి ఎన్నికల కమిషన్ తన తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు మాట్లాడుతూ రాజకీయవ్యవస్థను, పార్లమెంటరీ వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ఉమ్మడి ఉద్యమంగా అందరూ పని చేయాలని పిలుపునిచ్చారు. ఎన్‌డీఏ పాలనలో దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. రాజ్యాంగబద్ధంగా స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ బీజేపీ చేతిలో పావుగా మారిందన్నారు. ఎన్నికల కమిషన్‌ను నియమించే వ్యవస్థను దెబ్బతీశారన్నారు. ఇప్పుడు ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేయడం, అక్రమాలకు పాల్పడటం చూశామని, ఇకపై ఎన్నికల్లో ఏకంగా ఓట్లు లేకుండా చేయడం చూస్తామన్నారు. సర్ భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశమంతటా అమలు కాబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, చుక్కపల్లి తిరుమలరావు, టాక్స్‌పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎంవీ ఆంజనేయులు డీవీ కృష్ణ, అంద్ర మల్యాద్రి, ఎస్‌సిహెచ్ శ్రీనివాస్, బోయి సత్యబాబు, బి.రమణరావు, పి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు గరుత్మంతుడు విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోనే ప్రప్రథమంగా ముత్యాలంపాడు కోదండ రామాలయంలో 36 అడుగుల గరుత్మంతుడు విగ్రహ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేయనున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి దాట్ల శివరామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాల సర్ప నాగదోష, దుష్ట శక్తులు, సర్పదోష నివారణ, రుణబాధలు అనారోగ్య సమస్యలు తొలగి ప్రజలు సుఖసంతోషాలతో ఉండేందుకుగానూ తాము 36 అడుగుల గరుత్మంతుడు విగ్రహ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

క్విట్ ఇండియా దినోత్సవం

తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలనులో శుక్రవారం క్విట్ ఇండియా దినోత్సవాన్ని షిర్డీ సాయి బాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. 1942 ఆగస్టు 8న మహాత్మాగాంధీ బ్రిటిష్ పాలకులను దేశం నుంచి తరిమికొట్టేందుకు చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమ ప్రాముఖ్యతను సాయిబాబా సేవా కమిటీ అధ్యక్షుడు ఊటుకూరు నారాయణరావు విద్యార్థులకు వివరించారు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న నేతల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీ ప్రదర్శించి వారి పోరాట గాథను తెలిపారు. సమరయోధులకు సేవా కమిటీ సభ్యులు నివాళులర్పించారు.